సాక్షి మహబూబాబాద్

సోమవారం । 24 । మార్చి । 2025



డైరెక్టర్ పోస్టులు ఖాళీ..
టీజీ ఎన్పీడీసీఎల్‌లో డైరెక్టర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసి 14 నెలలు దాటినా నియామక ప్రక్రియలో జాప్యం జరుగుతోంది.
- 8లో▸



బీఆర్ఎస్ నేతల నిరసన సిగ్గుచేటు
దేవాదుల పంప్‌హౌస్ వద్ద బీఆర్ఎస్ నేతలు నిరసన చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
37.2^0 / 23.2^0


వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ కాస్త చలిగా ఉంటుంది.



వెక్కిరిస్తున్న ఖాళీలు

విద్యుత్‌శాఖలో సిబ్బంది లేక ఇబ్బంది

- 105జేఎల్ఎం పోస్టుల్లో 93 వెకెన్సీ..
- ఆపరేటర్లు లేక నిరుపయోగంగా సబ్‌స్టేషన్లు
- ఫ్యూజ్‌పోతే గంటల తరబడి ఎదురుచూపులు



నిరుపయోగంగా తాళ్లపూసపల్లి సబ్‌స్టేషన్

సాక్షి, మహబూబాబాద్: విద్యుత్ విలాస వస్తువు నుంచి నిత్యావసరంగా మారింది. కరెంట్ లేకపోతే అంతా ఉక్కిరి బిక్కిరి.. ఎక్కడి పనులు అక్కడే.. ఇంతటి ప్రాధాన్యత ఉన్న విద్యుత్ శాఖలో సరిపడా సిబ్బంది, ఉద్యోగులు లేక ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గతంతో పోలిస్తే విద్యుత్ కనెక్షన్లు, వినియోగం పెరిగింది. కానీ అందుకు అనుగుణంగా ఉద్యోగుల నియామకం జరగకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతుందని అధికారులు చెబుతున్నారు.

పెరిగిన వినియోగం..

జిల్లా వ్యాప్తంగా రోజురోజుకూ విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ప్రస్తుతం జిల్లాలో గృహ అవసరాల కోసం 2,17,294 కనెక్షన్లు, కమర్షియల్ 22,927, పరిశ్రమలకు1,287, కుటీర పరిశ్రమలకు 373, వ్యవసాయ పంపుసెట్లకు 93,422, వీధి దీపాలకు 3,104, తాగునీటి సరఫరాకు 1,577, గుడి, బడికి 1,380, తాత్కాలిక అవసరాల కోసం 165, మొత్తం 3,41,530 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈమేరకు జిల్లాలో ఏడు 133/33 కేవీ సబ్‌స్టేషన్లు, రెండు 220/130 సబ్‌స్టేషన్లు ఉన్నాయి. అలాగు 72 చోట్ల 33/11 కేవీ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. కాగా లోడు పెరగడంతో తాళ్లపూసపల్లి, రామచంద్రాపురం, నర్సింహులగూడెం, సత్యనారాయణపురం ప్రాంతాల్లో ఇటీవల 33/11 కేవీ సబ్‌స్టేషన్లు నిర్మించారు. కేసముద్రం, బత్తులపల్లి, ఉప్పరపల్లి, సోమ్లాతండా, వేంనూరు, రాంచంద్రాపురం, మట్టెవాడ, కోమట్లగూడెం ప్రాంతాల్లో కొత్త సబ్‌స్టేషన్లు అవసరమని గుర్తించారు. కొన్నిచోట్ల స్థల సేకరణ కూడా చేశారు.

వెంటాడుతున్న ఉద్యోగుల కొరత..

పెరిగిన విద్యుత్ వినియోగానికి అనుగుణంగా కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణాలు చేపట్టడంతో పాటు మరి కొన్ని చోట్ల ఏర్పాటుకు రూపకల్పన చేస్తున్నారు. అయితే ఇందుకు అనుగుణంగా సిబ్బంది, ఉద్యోగులను నియమించడం లేదనే విమర్శలు ఉన్నాయి. గతంలో ప్రతీ గ్రాపంచాయతీకి ఒక హెల్పర్, పెద్ద పంచాయతీలకు లైన్‌మెన్, మండలానికో ఏఈ ఉండేవారు. అయితే జిల్లా ఆవిర్భావం తర్వాత ప్రస్తుతం 18 మండలాలు, 482 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే ఇందుకు అనుగుణంగా కొత్త పోస్టుల మంజూరు లేకపోగా.. మంజూరైన 109 జూనియర్ లైన్‌మెన్ల పోస్టులకు గాను కేవలం 16 పోస్టులే భర్తీ చేశారు. అంటే ఒక్క జేఎల్ఎం పోస్టులే 93 ఖాళీలు ఉన్నాయి. అదే విధంగా హెల్పర్ల వ్యవస్థ లేకపోవడంతో అన్‌మ్యాన్డ్, ఆర్టిజన్ పేరిట కాంట్రాక్టు ఉద్యోగులను నియమించినా.. అవి కూడా కొన్నిచోట్లకే పరిమితం అయ్యాయి. దీంతో గ్రామాల్లో చిన్నపాటి మరమ్మతు వచ్చినా.. గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడటం, సబ్‌స్టేషన్ల పర్యవేక్షణ చేపట్టాల్సిన ఆపరేటర్ పోస్టులు కూడా ఖాళీగానే ఉన్నాయి. ఒక్కో సబ్‌స్టేషన్‌కు ముగ్గురు చొప్పున జిల్లాలోని 72 సబ్‌స్టేషన్లకు 216 మంది ఆపరేటర్లు ఉండాలి. కానీ మొత్తం 140 మంది మాత్రమే పనిచేస్తుండగా 76ఆపరేటర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఉన్న వారిపైనే అదనపు భారం పడి డబుల్ డ్యూటీలు చేయాల్సి వస్తోంది. ఈమేరకు ఇటీవల నాలుగు సబ్‌స్టేషన్ల నిర్మాణాలు పూర్తికాగా.. ఆపరేటర్లు లేకపోవడంతో మూడు సబ్‌స్టేషన్లు నిరుపయోగంగా మారాయి. ఒకవైపు సరిపడా సిబ్బంది లేక.. మరోవైపు నిర్మించిన సబ్‌స్టేషన్లు అందుబాటులోకి రాకపోవడంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



జిల్లాలో ఏఎల్ఎంల కొరత ఉన్నది వాస్తవమే. దీంతో కొత్త సబ్‌స్టేషన్లను ప్రారంభించడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. వారి ఆదేశాల మేరకు ఆపరేటర్ల నియామకం చేపడుతాం. మరికొద్దిరోజుల్లో కొత్త జేఎల్ఎం నియామకాలు చేపట్టే అవకాశం ఉంది. కొత్త జేఎల్ఎంలు వస్తే ఇబ్బందులన్నీ తొలుగుతాయి.

- జనగాం నరేశ్, ఎస్ఈ, మహబూబాబాద్

కార్యదర్శుల సతమతం

- రెండేళ్లుగా జీపీలకు విడుదల కాని నిధులు
- పంచాయతీ కార్యదర్శులకు భారంగా మారిన పాలన
- ఇకమీదట పెట్టుబడి పెట్టబోమని అధికారులకు వినతి





బయ్యారం మండలంలోని జగ్గుతండా పంచాయతీ కార్యాలయం

బయ్యారం: దేశానికి పల్లెలు పట్టుగొమ్మలు.. గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం. అయితే నిధులు లేకపోవడంతో పల్లెల్లో అభివృద్ధి పడకేసింది. జిల్లాలో 482 పంచాయతీలు ఉండగా.. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినాటి నుంచి ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు పాలన కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాక ఇటు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టలేక కార్యదర్శులు సతమతమవుతున్నారు.

అప్పులు తెచ్చి పెట్టుబడి..

గ్రామ పంచాయతీల అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో జీపీల నిర్వహణకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ పాలనలో పారిశుద్ధ్య సమస్య పరిష్కారంతో పాటు నర్సరీల నిర్వహణకు అవసరమైన నీటిని సరఫరా చేసేందుకు ప్రతీ జీపీలో ఒక ట్రాక్టర్‌ను కొనుగోలు చేయించారు. కాగా ట్రాక్టర్ నిర్వహణ, వీధిలైట్లు, తాగునీరు, నర్సరీల నిర్వహణ, తదితర పనులకు సంబంధించిన ఖర్చుల కోసం కార్యదర్శులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉంది. కొన్ని పంచాయతీల్లో పన్నుల ద్వారా వచ్చిన డబ్బులను ట్రెజరీలో జమ చేసినప్పటికీ ఆ డబ్బులు తిరిగి ఖర్చుల కోసం బిల్లులు పంపిస్తే నెలలు గడిచినా విడుదల కావడం లేదని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.2 నుంచి రూ.6 లక్షల వరకు అప్పులు..

జిల్లాలోని చిన్న పంచాయతీలు మొదలుకొని పెద్ద పంచాయతీల వరకు ఆయా జీపీల కార్యదర్శులు లక్షల్లో అప్పులు చేసి నిధుల కోసం ఎదురుచూస్తున్నారు. చిన్న పంచాయతీల కార్యదర్శులు రూ.2 లక్షలు, పెద్ద పంచాయతీల కార్యదర్శులు రూ.6 లక్షల వరకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టినట్టు పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు పేర్కొంటున్నారు.

ఇక పెట్టుబడి పెట్టలేం..



గ్రామ పంచాయతీల నిర్వహణకు మా స్థాయికి మించి అప్పులు చేశాం. ఆ అప్పుల భారం మోయలేని స్థితిలో మా పంచాయతీ కార్యదర్శులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్చి నుంచి పంచాయతీ నిర్వహణకు పెట్టుబడి పెట్టలేమని మా కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చాం. ఇప్పటికైనా పేరుకుపోయిన బకాయిలు చెల్లించి పంచాయతీల్లో పనులు కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- ధరావత్ రాజ్‌కుమార్, మండల కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు, బయ్యారం

క్రికెట్ బెట్టింగ్‌లు ప్రమాదకరం

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



మహబూబాబాద్ రూరల్: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లపై బెట్టింగ్‌లు పెట్టి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. ఆదివారం ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. క్రికెట్ బెట్టింగ్‌లు పెట్టి ఆర్థికంగా నష్టపోయి చివరికు ఆత్మహత్య చేసుకుంటే కుటుంబాలు రోడ్డున పడతాయని అన్నారు. ఐపీఎల్ మ్యాచ్‌ల వల్ల తమ పిల్లల్లో ఏమైనా మార్పులు కనబడితే తల్లిదండ్రులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. లేదంటే డబ్బులు, ప్రాణాలు పోయే అవకాశం ఉందన్నారు. బెట్టింగులు పెట్టడం చట్టరీత్యా నేరమని, ఎవరైనా ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ బెట్టింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

విప్లవ వీరుడు భగత్‌సింగ్



నెహ్రూసెంటర్: దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించిన విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ అని నేతాజీ సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ కందుల నాగరాజు అన్నారు. భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, వివేక్, గంగాధర్, రోహిత్, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, రఘు, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల రాష్ట్ర అధ్యక్షురాలిగా మాధవి



మరిపెడ రూరల్: తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామానికి చెందిన మారిపెల్లి మాధవి మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహించగా మాధవిని రెండోసారి అధ్యక్షురాలిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాధవికి మరిపెడ మండల వీఓఏల కమిటీ అధ్యక్షుడు రాంపెల్లి వెంకన్న, కమిటీ సభ్యులు కొండూరు వెంకన్న, మౌనిక, పద్మ, శాంతి, సువర్ణ, గీతాదేవి, ఉపేందర్, కరుణమయుడు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

గోటి తలంబ్రాల శోభాయాత్ర



డోర్నకల్: సీతారాముల కల్యాణం కోసం సిద్ధం చేసిన గోటి తలంబ్రాలతో డోర్నకల్‌లో ఆదివారం శోభాయాత్ర నిర్వహించారు. డోర్నకల్ ఆధ్యాత్మిక సమితి ఆధ్వర్యంలో స్థానిక భక్తుల నుంచి సేకరించిన గోటి తలంబ్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శోభాయాత్ర నిర్వహించారు. పాత డోర్నకల్‌లోని హనుమాన్ మందిర్ నుంచి బ్యాంక్‌స్ట్రీట్ వేంకటేశ్వరాలయం, గాంధీ సెంటర్‌లోని ముత్యాలమ్మతల్లి ఆలయం మీదుగా రైల్వే రామాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

మహబూబాబాద్ అర్బన్: మార్కెట్‌లో జరుగుతున్న మోసాలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని కన్జ్యూమర్ ఫోరం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో వినియోగదారులకు మార్కెట్‌లో జరుగుతున్న మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. వస్తువుల కొనుగోలులో మోసపోయిన వినియోగదారులకు అండగా ఉండి, న్యాయం జరిగే విధంగా పోరాడుతామన్నారు. ఏ వస్తువు కొనుగోలు చేసిన తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు వస్తువులు విక్రయిస్తే సంబంధిత వివరాలను కన్జ్యూమర్ ఫోరం దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణయ్య, సురేశ్ నాయక్, మంగు నాయక్, అమృత, వెంకన్న, రాజ్ కుమార్, ఉప్పలయ్య, కృష్ణమూర్తి, లింగయ్య, మల్లేశ్, రమేశ్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, దయాకర్ తదితరులు

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్న అసత్య ప్రచారాలు, కుట్రలను తిప్పికొట్టాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, జై బాపు-జై భీమ్-జై సంవిధాన్ జిల్లా ఇన్‌చార్జ్ చెరగాని దయాకర్ అన్నారు. జై బాపు-జై-భీమ్-జై సంవిధాన్ కార్యక్రమ పాదయాత్ర ప్రారంభంపై జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల కాంగ్రెస్ శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంవిధాన్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని పాదయాత్రతో ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ప్రధాని మోదీ, అమిత్ షా విస్మరించారన్నారు. మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలన్నారు. సంవిధాన్ కార్యక్రమం ఏడాదిపాటు కొనసాగుతుందని, గ్రామాల్లో పాదయాత్ర ప్రారంభానికి ముందు బాపూజీ, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించాలన్నారు. మండల అధ్యక్షులు ప్రతీ గ్రామంలో పర్యటించి, సమావేశాలు నిర్వహించి పాదయాత్ర చేసే విధంగా సంవిధాన్ కార్యాచరణ రూపొందించుకోవాలన్నా రు. అనంతరం కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ నాయక్, నాయకులు ప్రకాశ్‌రెడ్డి, రామిరెడ్డి, నాగేశ్వర్ రావు, సతీష్, ప్రభాకర్, వెంకన్న, వీరభద్రం, రఘువీర్, రజనీకాంత్, శ్రీను పాల్గొన్నారు.

కంఠాయపాలెంలో విషాదచాయలు

- సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- భార్యా, భర్త, కూతురు మృతి
- స్వగ్రామంలో మిన్నంటిన రోదనలు



భార్యభర్తలు రవీందర్, రేణుకతో కూతురు రిషిత (ఫైల్)

తొర్రూరు రూరల్: సూర్యాపేట జిల్లాలోని బీబీగూడెం గ్రామ శివారులో ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తొర్రూరు మండలంలోని కంఠాయపాలెం గ్రామానికి చెందిన భార్య, భర్తలతోపాటు కూతురు మృతి చెందింది. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. వివరాల ప్రకారం.. కంఠాయపాలెం గ్రామానికి చెందిన గడ్డం రవీందర్ హైదరాబాద్ కారు డ్రైవర్‌గా పని చేస్తూ భార్య, కూతురు, కుమారుడిని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో తన అత్తగారి స్వగ్రామమైన ఆత్మకూరు మండలంలోని కోటపహాడ్ గ్రామంలో జరిగిన ఓ పండుగకు హాజరై కుటుంబ సభ్యులతో తిరిగి హైదారాబాద్‌కు కారులో వెళ్తుండగా.. మార్గమధ్యలో బీబీగూడెం శివారులో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈప్రమాదంలో కారు డ్రైవర్‌గా ఉన్న గడ్డం రవీందర్ (34), భార్య గడ్డం రేణుక(28), కుమార్తె రిషిత(8)కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే మరికొంతమందికి తీవ్రగాయాలైనట్లు తెలిసింది. సమాచారం తెలిసిన కంఠాయపాలెం గ్రామంలోని మృతుడు రవీందర్ తల్లి గడ్డం లక్ష్మితోపాటు బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.


ఒరిజినల్ ఆధార్ కార్డుతో ప్రయాణించాలి

నెహ్రూసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళా ప్రయాణికులు ఒరిజినల్ ఆధార్ కార్డుతో ప్రయాణించాలని మహబూబాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ శివప్రసాద్ ఆదివారం తెలిపారు. మహిళా ప్రయాణికులకు మహబూబాబాద్ డిపో నుంచి ఉచిత సర్వీసులు నడుపుతుందని తెలిపారు. ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించుకుని ఒరిజినల్ ఆధార్ కార్డు పట్టుకుని బస్సులో ప్రయాణించాలని సూచించారు.

సమయం లేదు మిత్రమా..

- గ్రామ పంచాయతీల్లో 85శాతం పన్నుల వసూలు
- గంగారం, డోర్నకల్, చిన్నగూడూరులో వందశాతం పూర్తి
- మిలిగింది 7 రోజులే..

మహబూబాబాద్: జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్ల ప్రక్రియ సాగుతోంది. ఇప్పటి వరకు 85శాతం వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. మున్సిపాలిటీల కంటే జీపీల్లో వసూళ్ల మెరుగ్గా ఉన్నాయి. కాగా, ఉన్నతాధికారుల ఆదేశాలతో పన్నుల వసూళ్లను వేగవంతం చేశారు. డిమాండ్ రూ.4,99,06,067 ఉండగా.. రూ.4,25,78,125 వసూళ్లు చేశారు. ఇంకా రూ.73,27,942 బ్యాలెన్స్ ఉందని అధికారులు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ఈనెల 31తో ముగియనుండగా.. వందశాతం వసూలు చేసేలా సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు.



మొత్తం మండలాల వారీగా పన్నుల డిమాండ్, వసూళ్లు, శాతం ఇలా..

నెల్లికుదురు మండలంలోని పార్వతమ్మ గూడెం జీపీ

మండలాల వారీగా పన్నుల వసూళ్లు ఇలా

మండలం	డిమాండ్(రూ.)	వసూళ్లు(రూ.)	శాతం
డోర్నకల్	11,49,386	11,50,317	100
గంగారం	57,72,93	57,72,93	100
మానుకోట	28,54,199	26,99,632	95
సీరోలు	15,1,4510	13,56,339	90
బయ్యారం	47,85,887	42,45,397	89
కొత్తగూడ	19,35671	16,70,408	86
గార్ల	61,76838	52,90,783	86
కురవి	46,63,217	39,70,892	85
కేసముద్రం	2440292	19,96,147	82
ఇనుగుర్తి	14,59,964	11,01,679	75
గూడూరు	55,62,597	37,72,670	68
చిన్నగూడూరు	72,78,85	72,82,43	100
మరిపెడ	19,48,275	19,14,053	98
నర్సింహులపేట	25,93,380	24,17,536	93
నెల్లికుదురు	45,50,120	41,01,714	90
తొర్రూరు	31,71,646	26,42,434	83
దంతాలపల్లి	19,55,902	16,14,085	83
పెద్దవంగర	18,39,005	13,28,503	72

జిల్లాలో 482 జీపీలు..

జిల్లాలో ప్రస్తుతం 482 గ్రామపంచాయతీలు ఉన్నాయి. పాత జీపీలు 461 ఉండగా ఇటీవల కేసముద్రం మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ కాగా ఐదు గ్రామాలు ఆ మున్సిపాలిటీలో కలిశాయి. దీంతో జీపీల సంఖ్య 456కు తగ్గింది. అనంతరం కొత్తగా 26 జీపీలు ఏర్పాటు చేయడంతో సంఖ్య 482కి చేరింది. జిల్లాలో 428 మంది కార్యదర్శులు ఉండగా వారిలో 39జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, 377మంది సీనియర్ పంచాయతీ కార్యదర్శులు, అవుట్ సోర్సింగ్‌లో 12 మంది పనిచేస్తున్నారు. అలాగే 1,806 మంది మల్టీపర్పస్ వర్కర్లు ఉన్నారు. కార్యదర్శులపై భారం ఉండడంతో పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. కాగా జిల్లాలో 2,02,496 గృహాలు ఉన్నాయి

మూడు మండలాల్లో వందశాతం..

జిల్లాలోని డోర్నకల్, గంగారం మండలాలతో పాటు చిన్నగూడూరు మండలంలో వంద శాతం పన్నులు వసూలు చేశారు. మరిపెడ మండలంలో 98 శాతం, మానుకోట 95 శాతం, నర్సింహులపేట 93 శాతం, నెల్లికుదురు మండలంలో 90 శాతం పన్నులు వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు.

మిగిలింది 7రోజులు మాత్రమే ..

జిల్లాలో 85శాతం పన్నులు వసూలు కాగా ఈనెల 31లోపు వందశాతం పన్నుల వసూళ్లు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కాగా అధికారులుసమావేశాలు నిర్వహించి పన్నుల పురోగతిపై సమీక్షించి ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశిస్తున్నారు. అయితే వందశాతం పన్నుల వసూళ్లకు మరో 7రోజులు మాత్రమే మిగిలి ఉంది.

వందశాతం పూర్తి చేస్తాం

జీపీల్లో వందశాతం పన్నులు వసూలు చేస్తాం. ఇప్పటికే 85శాతం పూర్తయింది. నెలాఖరులోగా పూర్తిచేసేందుకు కసరత్తు చేస్తున్నాం. ప్రజలు కూడా సహకరించాలి. పన్నులు చెల్లిస్తే జీపీలు అభివృద్ధి సాధిస్తాయి.

- హరిప్రసాద్, డీపీఓ

గుండెపుడిలో తాగునీటి గోస



చేతి పంపు వద్ద క్యూలో నిలబడి నీటిని పట్టుకుంటున్న మహిళలు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం గుండెపుడి గ్రామస్తులు తాగునీటి కోసం గోస పడుతున్నారు. గ్రామంలోని బర్లపెంట బజార్‌కు మూడు నెలలుగా నీటి సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామ పంచాయతీ వాటర్ మెన్‌కు సమస్య తెలియజేసినప్పటికీ.. ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటిని ట్యాంకర్ల ద్వారా తెప్పించుకొని వాడుకునే దుస్థితి నెలకొందని కాలనీవాసులు వాపోయారు. అదే విధంగా మరికొంత మంది సుదూర ప్రాంతంలోని చేతి పంపు నీటిని తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ కాలనీకి నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు వేడుకున్నారు.

డైరెక్టర్ పోస్టులు ఖాళీ..

నోటిఫికేషన్ విడుదల చేసి 14 నెలలు..

- దరఖాస్తులు స్వీకరించినా కొనసాగని ప్రక్రియ
- టీజీ ఎన్పీడీసీఎల్‌లో ఇన్‌చార్జ్ డైరెక్టర్లతో పనులు
- సర్కారు జాప్యంతో ఆశావహుల్లో నైరాశ్యం

హన్మకొండ: తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ మండలిలో (టీజీ ఎన్పీడీసీఎల్) డైరెక్టర్ పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. నోటిఫికేషన్ జారీ చేసి 14 నెలలు అయినా నియామక ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. ఫలితంగా ఆశావాహుల్లో నైరాశ్యం నెలకొంటోంది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 2024 జనవరి 29న అప్పటి వరకు ఉన్న టీజీ ఎన్పీడీసీఎల్ పాలక మండలిని తొలగించింది. కొత్త పాలక మండలి నియామకంలో భాగంగా నాలుగు డైరెక్టర్ పోస్టుల నియామకానికి 2024 జనవరి 30న నోటిఫికేషన్‌కు జారీ చేసింది. అప్పటికే ఐఏఎస్ అధికారి కర్నాటి వరుణ్ రెడ్డిని చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించింది. నాలుగు డైరెక్టర్‌ల పోస్టులకు 2024 మార్చి 2వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించింది. దాదాపుగా 83 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. అయితే ఈ పోస్టుల భర్తీపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన సంకేతాలు రావడం లేదు. ఫలితంగా ఆ పోస్టులు ఎప్పుడు భర్తీ అవుతాయో తెలియని అయోమయంలో ఆశావహులు కొట్టుమిట్టాడుతున్నారు.


టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం

టీజీఎన్పీడీసీఎల్ స్వరూపం..

కంపెనీ విస్తరించిన జిల్లాలు	17
మండలాలు	299
గ్రామాలు	5,580
హామ్లెట్ గ్రామాలు	7,474
విద్యుత్ సర్వీస్‌లు	68,62,858
ఉద్యోగులు	9 వేలకు పైగా..

కంపెనీకి రూ.1.28 కోట్లు ఆదా..

టీజీఎన్పీడీసీఎల్.. ఒక్కో డైరెక్టర్‌కు నెలకు రూ.1.50 లక్షల వేతనం, రూ.30 వేల అలవెన్స్‌లు, వాహన సౌకర్యానికి రూ.50 వేలు చెల్లిస్తోంది. ఒక్క డైరెక్టర్‌కు నెలకు రూ.2.30 లక్షలు చెల్లిస్తుంది. ఈ లెక్కన నలుగురు డైరెక్టర్లకు నెలకు రూ.9.20 లక్షలు చెల్లిస్తోంది. ఈ లెక్క ప్రకారం నలుగురు డైరెక్టర్లకు ఏడాదికి చెల్లించాల్సిన రూ.1,10,40,000లు కంపెనీకి మిగిలాయి. ఫలితంగా 14 నెలలకు రూ.1,28,80,000లు ఎన్పీడీసీఎల్‌కు ఆదా అయ్యాయి. టీజీ ఎన్పీడీసీఎల్ ప్రస్తుతం రూ.13,393 కోట్ల రెవెన్యూ లోటులో ఉంది. ఈ క్రమంలో పూర్తి స్థాయి డైరెక్టర్ల నియామకం చేయకపోవడంతో 14 నెలల కాలానికి రూ.1,28,80,000 మిగులుతో కొంతలోటు భర్తీ చేసుకుంది. కాగా, సంస్థలో ఒక చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌తో పాటు నలుగురు డైరెక్టర్లు ఉంటారు.

డైరెక్టర్ పోస్టుల భర్తీలో నాన్చివేత ధోరణి..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అప్పటి వరకు పని చేస్తున్న డైరెక్టర్లను తొలగించి చీఫ్ జనరల్ మేనేజర్లను ఇన్‌చార్జ్ డైరెక్టర్లుగా నియమించారు. వీరు సీజీఎంలుగా, డైరెక్టర్‌లుగా రెండు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సీజీఎంగా ఒక విభాగం, డైరెక్టర్‌గా మరో విభాగాన్ని పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రంలోని టీజీ ట్రాన్స్‌కో, టీజీ జెన్‌కో, టీజీ ఎన్పీడీసీఎల్, తెలంగాణ సౌథర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో పని చేస్తున్న సీజీఎంలు, రిటైర్డ్ సీఈలు, గతంలో పని చేసిన డైరెక్టర్లు.. టీజీఎన్పీడీసీఎల్ డైరెక్టర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో టీజీ ఎన్పీడీసీఎల్‌లో ప్రస్తుతం పని చేస్తున్న సీజీఎంలు కూడా ఉన్నారు. దరఖాస్తులు స్వీకరించి 12 నెలలవుతున్నా డైరెక్టర్ పోస్టుల భర్తీలో నాన్చివేత ధోరణి అవలంబిస్తోంది. దీంతో ఆశావహులు సుదీర్ఘకాలం వేచిచూడక తప్పని పరిస్థితి నెలకొంది. పూర్తి కాలం డైరెక్టర్ల నియామకం చేపట్టకపోయిన కంపెనీకి కార్యకలాపాలు, అభివృద్ధి పనులు యథాతథంగా నడుస్తుండడంతో డైరెక్టర్లు లేని లోటు కనిపించడం లేదు.

ఆశావహులకు నిరాశ, ఎదురుచూపులే..

ప్రధాన నిర్ణయాలు తీసుకునే బోర్డులో కనీస డైరెక్టర్లు ఉండడంతో నిర్ణయాలు తీసుకోవడంలో ఎలాంటి అవాంతరాలు, అడ్డంకులు ఏర్పడడం లేదు. బోర్డు మీటింగ్‌లో పాల్గొనేందుకు కనీసం ముగ్గురు పూర్తి స్థాయి డైరెక్టర్లు ఉంటే సరిపోతుందని విద్యుత్‌రంగ నిపుణులు తెలిపారు. ఈ మేరకు బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి, టీజీ ట్రాన్స్‌కో నుంచి జి.నర్సింగరావు, ప్రభుత్వ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ నుంచి డిప్యూటీ సెక్రటరీ కె.చంద్రకళ, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.పక్కీరిసామి, రూరల్ ఎలక్ట్రిక్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దల్జీత్‌సింగ్ ఖత్రీ పూర్తి స్థాయి డైరెక్టర్లు ఉన్నారు. వీరితో పాటు ఈ బోర్డులో ఇన్‌చార్జ్ ఫైనాన్స్ డైరెక్టర్ వి.తిరుపతి రెడ్డి, ఇన్‌చార్జ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ టి.సదర్‌లాల్ ఉన్నారు. దీంతో నిర్ణయాలు తీసుకోవడంతో పాటు పనుల చకచకా సాగుతున్నాయి. పూర్తి స్థాయి డైరెక్టర్లు లేరనే లోటు కనిపించడం లేదు. అయితే డైరెక్టర్లు కావాలనే ఆశావహులకు మాత్రమే నిరాశ, ఎదురుచూపులు తప్పడం లేదు.

ప్రమాదంలో భారత రాజ్యాంగం

- ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ బెల్లయ్య నాయక్


మాట్లాడుతున్న బెల్లయ్య నాయక్

హన్మకొండ: భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్, తెలంగాణ ఎస్టీ సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ బెల్లయ్య నాయక్ అన్నారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ.. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తోందని విమర్శించారు. 'రాజ్యాంగాన్ని కాపాడడం ఎలా' అనే అంశంపై ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆదివాసీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఏప్రిల్ 13, 14, 15 తేదీల్లో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు వివరించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీలను అణిచివేస్తోందన్నారు.ఆదివాసీలకు బీజేపీ చేస్తున్న అన్యాయాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో చేసిన కులగణన కేవలం బీసీ కులగణన మాత్రమే కాదని, అన్ని కులాల శాతాన్ని నిర్ధారించామన్నారు. కులగణను బీజేపీ తప్పు పట్టడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. బీజేపీ విధానాలు కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేలా ఉన్నాయన్నారు. ఆదివాసీలను మేల్కొపేందుకు రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో హనుమకొండలో వచ్చే నెలలో నిర్వహిస్తున్నామని, గిరిజన నాయకులు, కార్యకర్తలు ఈ శిక్షణకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆదివాసీ కాంగ్రెస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ రవీందర్ నాయక్, ఇన్‌చార్జ్ చంద్రకళ, నాయకులు రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆడుకుంటూ వెళ్లి అనంతలోకాలకు..

నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి

- ఆశాలపల్లిలో ఘటన
- మిన్నంటిన వలస కూలీ దంపతుల రోదనలు


చిన్నారి మృతదేహం

సంగెం: ఓ చిన్నారి ఆడుకుంటూ వెళ్లి అనంత లోకాలకు చేరింది. నీటి తొట్టిలో పడి మృతి చెందింది. ఈ ఘటన సంగెం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశాలోని బులియాభన్ గ్రామానికి చెందిన రాజు మహాకూర్, రాణి దంపతులు బతుకుదెరువు నిమిత్తం మూడు నెలల క్రితం సంగెం మండలం ఆశాలపల్లికి వలస వచ్చారు. గ్రామ శివారులో బుజ్జయ్య చౌదరి ఇటుకబట్టీలో పనిచేస్తున్నారు. రాజుకు బబితా మహాకూర్ అనే ఏడాదిన్నర ఏకైక కూతురు ఉంది. ఈక్రమంలో తల్లిదండ్రులు శనివారం సాయంత్రం ఇటుక బట్టీలో పనిచేస్తుండగా వారి పక్కనే చిన్నారి బబితా ఆడుకుంటోంది. ఆడుకుంటూ అక్కడే ఉన్న నీటి తొట్టిలో పడింది. బబితను మరో కూలీ రక్షిత పటేల్ చూసి కేకలు వేయడంతో హుటాహుటిన బయటకు తీసి వెంటనే ఎంజీఎం తరలించి చికిత్స చేయిస్తుండగా అదే రోజు రాత్రి మృతి చెందింది. బతుకుదెరువు కోసం వస్తే ఏకైక కూతురు నీటితొట్టికి బలైందని ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ ఆదివారం తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం


మంటల్లో కాలుతున్న ఇల్లు

కాటారం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున కాటారం మండలం దేవరాంపల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బాధితురాలు జిముడ దుర్గమ్మ గ్రామంలో తెలిసిన వారి ఇంట్లో నిద్రిస్తోంది. ఈ క్రమంలో ఆమె ఇంట్లో విద్యుత్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు భారీగా చెలరేగాయి. గమనించిన చుట్టు పక్కల వారు దుర్గమ్మకు సమాచారం అందించి మంటలు ఆర్పడానికి ప్రయత్నించారు. మంటలు అదుపులోకి రావడంతో మంథని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం చేరవేయగా ఇంజన్, సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. కానీ ఆలోపే ఇల్లు మొత్తం కాలిపోవడంతోపాటు సామగ్రి, నిత్యావసర సరుకులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షల నగదు, రెండు తులాల బంగారం, 20 తులాల వెండి, పత్తి బస్తాలు, బియ్యం, నిత్యావసర సరుకులు కాలిబూడిదైనట్లు బాధితురాలు దుర్గమ్మ కన్నీరుమున్నీరైంది. సుమారు రూ.10 లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు పేర్కొంది. ఈ ఘటనపై ప్రభుత్వం స్పందించి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని దుర్గమ్మ వేడుకుంది.

బీఆర్‌ఎస్ నేతల నిరసన సిగ్గుచేటు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నేతలు దేవాదుల ప్రాజెక్టును పట్టించుకోలేదని, ప్రస్తుతం దేవాదుల పంప్‌హౌస్ వద్ద నిరసన చేయడం సిగ్గుచేటని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏడాదిలోగా దేవాదుల పెండింగ్ పనులు పూర్తి చేసి నియోజకవర్గంలోని ప్రతీగ్రామంలో ప్రతీ ఎకరాకు సాగునీరు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మూడేళ్లలో లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగి పనికిరాకుండాపోయిందని, అదే దేవాదుల ప్రాజెక్టుకు రూ.5వేల కోట్లు కేటాయిస్తే పనులు పూర్తయ్యేవన్నారు. దేవాదుల కాల్వలు పూడిక, చెట్లు పెరిగి అధ్వాన స్థితిలో ఉన్నా ఏ నాడు బీఆర్‌ఎస్ నేతలు పట్టించుకోలేదని విమర్శించారు. పదిహేనేళ్లు ఎమ్మెల్యేగా ఉండి ఏనాడు దేవాదుల కాల్వల వెంట తిరగని వ్యక్తి, కాల్వల్లో మట్టితీయని వ్యక్తి ప్రస్తుతం దేవాదుల గురించి మాట్లాడేందుకు సిగ్గు ఉండాలన్నారు. దేవాదులను పూర్తి చేసి చివరి ఆయుకట్టు వరకు సాగునీరు అందించే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఆర్‌డీఓ డీఎస్ వెంకన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిరీశ్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ విజయశ్రీ, ఆర్‌ఐ శ్రీకాంత్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

మతంపేరుతో సాగుతున్న దౌర్జన్యాలను ఎండగట్టాలి

- ఎస్‌ఎఫ్‌ఐ సమ్మేళనంలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న
- పాల్గొన్న ప్రొఫెసర్ నాగేశ్వర్, సుద్దాల అశోక్‌తేజ


మాట్లాడుతున్న గోరటి వెంకన్న, వేదికపై ప్రొఫెసర్ నాగేశ్వర్, అశోక్‌తేజ తదితరులు

హన్మకొండ అర్బన్: మనువాద ముసుగులో మతం పేరుతో సాగుతున్న దౌర్జన్యాలను ఎండగట్టాలి.. మనువాదాన్ని ఓడించడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు అగ్రవర్ణాల్లోని ప్రగతిశీల భావాలున్నవారిని కలుపుకుపోవాలని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న పిలుపునిచ్చారు. హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ ఉమ్మడి వరంగల్ జిల్లా పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, అతిథులుగా ప్రొఫెసర్ నాగేశ్వర్, గాయకుడు సుద్దాల అశోక్‌తేజ పాల్గొని ప్రసంగించారు. గోరటి వెంకన్న మాట్లాడుతూ.. ప్రపంచంలో ఏ మతంలోనూ మనుషుల మధ్య అసమానతలు లేవని.. కేవలం మనువాదంలోనే అసమానతలు ఉన్నాయన్నారు. సాధారణ జీవితం గడపడాన్ని ఎస్‌ఎఫ్‌ఐ నేర్పిస్తుందని చెప్పారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం డీమిలిటేషన్ పేరుతో సమాఖ్య స్ఫూర్తిపై దాడి చేస్తోందన్నారు. భిన్నత్వంలో ఏకత్వం అన్న స్ఫూర్తిని చాటినచోట ఒకే జాతి, ఒకే మతం, ఒకే ఎన్నికలు అంటూ కొత్త విధానాలు ప్రవేశపెడుతున్నారని దుయ్యబట్టారు. సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమాలు, ఎర్ర జెండా ద్వారా స్ఫూర్తి పొంది తాను పాటలు రాయడం నేర్చుకున్నానని పేర్కొంటూ ఎస్‌ఎఫ్‌ఐతో ఉన్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ పరిధి జిల్లాల నుంచి ఎస్‌ఎఫ్‌ఐ నేతలు తరలివచ్చారు. కళాక్షేత్రం ఆవరణలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ రియాజ్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎస్.వీరయ్య, కేయూ మాజీ వీసీ టి.రమేశ్, ప్రముఖ రచయిత పసునూరి రవీందర్, నాయకులు జి.రాములు, ఎ.నర్సింహారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ కోల వెంకటేశ్వర్లు, శేషగిరిరావు, రమేశ్, పర్వతాలు, టి.ఉప్పలయ్య పాల్గొన్నారు.

యువతితో మాట్లాడినందుకు..

- యువకుడిపై కొందరి దాడి
- హనుమకొండ పీఎస్‌లో కేసు నమోదు

వరంగల్ క్రైం: ఓ యువతితో మాట్లాడినందుకు కొంతమంది యువకులు.. ఓ యువకుడిని కిడ్నాప్ చేసి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీశ్ కథనం ప్రకారం.. న్యూశాయంపేటకు చెందిన కోడెం సాయిచరణ్‌గౌడ్ ఈనెల 22న సాయంత్రం హనుమకొండ చౌరస్తాలో ఓ యువతితో ఉద్యోగ విషయంలో మాట్లాడుతున్నాడు. కొంత మంది యువకులు ఆ యువతితో ఎందుకు మాట్లాడుతున్నావని కిడ్నాప్ చేసి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై యువకుడి ఫిర్యాదు మేరకు ఎండీ అజీమ్, అఫ్సర్ షేక్, ఎండీ ఇర్షద్, ముజ్జు, మహ్మద్, షాబాజ్, ఫయాజ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఒకరి ఒరిజినల్ .. మరొకరికి డూప్లికేట్‌గా?

పదో తరగతి మెమో జారీపై ఆర్‌జేడీకి ఫిర్యాదు

- డీఈఓ విచారణ.. నివేదిక అందజేత
- ఆ పీజీహెచ్‌ఎంపై చార్జెస్ ఫ్రేమ్ చేశాం
- మరోసారి విచారణకు ఆర్‌జేడీ నిర్ణయం
- విచారణాధికారిగా డీఈఓ వాసంతి
- ఆ పీజీహెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని నేడు టీటీయూ ధర్నా

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జయశంకర్ భూపాలపల్లి కాటారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీజీహెచ్‌ఎంగా రాజమల్లయ్య పనిచేసిన కాలంలో పలు అవకతవకలకు పాల్పడ్డారని, ప్రధానంగా ఒకరు టెన్త్ చదవుకుని ఒరిజినల్ మెమో కలిగి ఉండగా మరొకరు డూప్లిమేట్ మెమో పొందేలా ఆ హెచ్‌ఎం నిర్వాకం చేశారని ఆరోపిస్తూ కొంత కాలం క్రితం తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ) బాధ్యులు పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీకి ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం రాజమల్లయ్య హనుమకొండ జిల్లా కమలాపూర్ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీజీ హెచ్‌ఎంగా విధుల నిర్వర్తిస్తున్నారు. టీటీయూ బాధ్యులు చేసిన ఫిర్యాదు ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కాటారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గంధం రమేశ్ 6 నుంచి 10వ తరగత వరకు చదువుకున్నాడు. 1997లో పదో తరగతి పూర్తిచేసి ఒరిజినల్ మెమో పొందాడు. గంధం రమేశ్ మెమోలో పేర్కొన్న హాల్‌టికెట్ నంబర్, మార్కులు మొదలైన వివరాలతో మరో వ్యక్తి పేరుమీద డూప్లికేట్ మెమో జారీకి రాజమల్లయ్య సహకరించారని టీటీయూ బాధ్యులు ఆరోపిస్తున్నారు. 2018నుంచి 2023వరకు కాటారంలోని ఆ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించిన రాజమల్లయ్య ఈ డూప్లికేట్ మెమోజారీ అయ్యేలా చేసి అవకతవకలకు పాల్పడ్డారని టీటీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఏరుకొండ నరసింహాస్వామి, ఇతర బాధ్యులు ఆరోపిస్తూ పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీకి కొంతకాలం క్రితమే ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులను కలిసి రాజమల్లయ్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. డీఈఓ విచారణ నివేదికలో రాజమల్లయ్య అవకతవకలకు పాల్పడ్డారని పేర్కొన్నా చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారని, అందుకే టీటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా కార్యక్రమం చేపట్టామని టీటీయూ రాష్ట్ర, జిల్లా బాధ్యులు తెలిపారు.

డీఈఓ విచారణ నివేదిక అందజేత

టీటీయూ ఫిర్యాదు మేరకు పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి.. జయశంకర్ భూపాలపల్లి డీఈఓ రాజేందర్‌ను విచారణాధికారిగా నియమించారు. దీంతో ఆయన ఈ ఏడాది జనవరి 24న కాటారం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో విచారణ జరిపారు. ఆ విచారణ నివేదికను ఆర్‌జేడీకి కొద్దిరోజుల క్రితం సమర్పించారు. ఈ విచారణలో గంధం రమేశ్ అనే వ్యక్తి టెన్త్ ఒరిజినల్ సర్టిఫికెట్ కలిగి ఉండగా మరొకరికి డూప్లికేట్ మెమో ఎలా జారీచేశారనేది ప్రధానంగా విచారణ జరిపి ఆర్‌జేడీకి నివేదిక అందజేశారు.అయితే నివేదికను అందజేశాక కూడా రాజమల్లయ్యపై చర్యలు తీసుకోవడంలేదని, సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న హనుమకొండలని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు టీటీయూ మాజీ రాష్ట్ర అధక్షుడు యు.భిక్షపతి, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరుకొండ నర్సింహాస్వామి వెల్లడించారు.

రాజమల్లయ్యపై చార్జెస్ ఫ్రేమ్‌చేశాం

రాజమల్లయ్యపై టీటీయూ బాధ్యుల ఫిర్యాదు మేరకు జయశంకర్ భూపాలపల్లి డీఈఓ రాజేందర్‌తో విచారణ జరిపించాం. ఆయన నివేదిక నాకు సమర్పించారు. ఆ పీజీహెచ్‌ఎం రాజమల్లయ్యపై చార్జెస్ ఫ్రేమ్ చేశాం. అందుకు రాజమల్లయ్య తాను డూప్లికేట్ మెమోజారీచేయలేదని వివరణ ఇచ్చారు. రాజమల్లయ్యపై ఆరోపణలపై మళ్లీ హనుమకొండ డీఈఓ వాసంతిని విచారణాధికారిగా నియమిస్తూ ఈనెల 20న ఉత్తర్వులు జారీచేశా. డీఈఓ వాసంతి విచారణ జరిపి నివేదిక ఇచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటాం.

-సత్యనారాయణరెడ్డి, పాఠశాల విద్యాశాఖ, ఆర్‌జేడీ

లోనికి పంపిస్తారా.. రోడ్డుపై బైఠాయించాలా?


- పోలీసులతో 'ఎర్రబెల్లి' వాగ్వాదం
- దేవాదుల పంప్‌హౌస్‌ను సందర్శించిన బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందం


పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ బృందం

హసన్‌పర్తి: పంప్‌హౌస్‌ను సందర్శించి వస్తాం.. లోనికి పంపిస్తారా.. లేదంటే ఇక్కడే బైఠాయించాలా అని మాజీ మంత్రి దయాకర్‌రావు అన్నారు. దేవన్నపేటలో నిర్మించిన దేవాదుల ప్రాజెక్టు మూడో దశ పంప్ హౌస్‌ను బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందం ఆదివారం సందర్శించడానికి వెళ్లింది. ముందు జాగ్రత్తగా కాజీపేట ఏసీపీ తిరుమల్ ఆధ్వర్యాన భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పంప్‌హౌస్ వద్దకు చేరుకోవడానికి ముందే బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. లోనికి పంపిస్తారా.. రోడ్డుపై బైఠాయించాలా? అని బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నించడంతో.. వారిని రెండు విడతలుగా వెళ్లడానికి అనుమతి ఇచ్చారు. మొదటి విడతలో మాజీ మంత్రి దయాకర్‌రావు, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డితో పాటు మరికొంత మందికి, రెండో విడతలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటి కొండరాజయ్యను అనుమతించారు. అనంతరం పల్లా, ఎర్రబెల్లి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలోనే దేవాదుల ప్రాజెక్టు పనులు 90శాతం పూర్తయ్యాయని, కాంగ్రెస్ సర్కార్ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. దీంతో వేలాది ఎకరాల పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, మాజీ సర్పంచ్‌లు చుంచు రవి, కొండపాక రఘు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, ఏనుగుల రాజేశ్‌రెడ్డితో పాటు దివ్యారాణి, రాజునాయక్, యాదగిరి, చింతం సదానందం తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముగ్గురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది.


సోమయ్య (ఫైల్)

మరిపెడ రూరల్: అప్పుల బాధతో ఓ వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం రాత్రి మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తయాయగూడెంలో చోటు చేసుకుంది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వల్లందాసు సోమయ్య (50) గతంలో తన ఇద్దరు కుమార్తెల వివాహాలు జరిపించాడు. ఈ క్రమంలో సుమారు రూ.3 లక్షల వరకు అప్పుచేశాడు. అప్పు తీర్చే మార్గం కనబడలేదు. దీంతో మనస్తాపానికి గురై శనివారం వ్యవసాయ క్షేత్రం వద్ద గడ్డి మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న సోమయ్యను కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాణిక్యాపురంలో యువకుడు..


మహేశ్ (ఫైల్)


నరసింహ(ఫైల్)

లింగాలఘణపురం: మండలంలోని మాణిక్యాపురం గ్రామానికి చెందిన చిన్నం మహేశ్ (24) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. మేస్త్రీ పనితోపాటు వ్యవసాయం చేస్తున్న మహేశ్.. ఆదివారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే మహేశ్ ఆత్మహత్యకు కారణాలు తెలియలేదని ఎస్సై తెలిపారు.

పిల్లలు లేరనే మనస్తాపంతో లక్ష్మీపూర్‌తండా గ్రామంలో వ్యక్తి..

చిట్యాల: అనారోగ్యంతో పాటు పిల్లలు లేరనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని లక్ష్మీపూర్‌తండా గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భుక్యా నరసింహ (55), విమల దంపతులకు 30 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. అప్పటి నుంచి వారికి పిల్లలు జన్మించలేదు. అలాగే, నరసింహ నాలుగు సంవత్సరాల నుంచి టీబీతో బాధపడుతున్నాడు. రెండు రోజులు నుంచి ఆరోగ్యం బాగా లేదని, తాను బతికి ఎవరికి ఉపయోగం, తనకు పిల్లలు లేకపాయే అని శనివారం తన భార్యతో చెప్పి బాధపడ్డాడు. ఈ క్రమంలో ఆదివారం ఆస్పత్రికి వెళ్దామని భార్య విమల చెప్పగా ఇద్దరు రాత్రి నిద్రించారు. తెల్లవారుజామున విమల బయటకు వచ్చి చూడగా నరసింహ ఇంటి ఎదుట ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడి కనిపించాడు. ఈ ఘటనపై మృతుడి భార్య విమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై శ్రావన్‌కుమార్ పేర్కొన్నారు.


బైక్‌ను ఢీకొన్న టిప్పర్..

- ఇద్దరు యువకుల దుర్మరణం
- హసన్‌పర్తి పెద్దచెరువు సమీపంలో ఘటన


పవన్ కల్యాణ్ (ఫైల్)


మహేశ్ (ఫైల్)

హసన్‌పర్తి: టిప్పర్.. బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈఘటన హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిలోని హసన్‌పర్తి పెద్దచెరువు సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హసన్‌పర్తి మండలం సీతంపేటకు చెందిన బౌతు మహేశ్(22), దుర్గం పవన్ కల్యాణ్(22) స్నేహితులు. వీరిద్దరు డెకర్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆదివారం ఇద్దరు బైక్‌పై వ్యక్తిగత పనినిమిత్తం హసన్‌పర్తికి వచ్చి తిరుగు ప్రయాణంలో సీతంపేటకు బయల్దేరారు. మార్గమధ్యలోని హసన్‌పర్తి పెద్ద చెరువు మలుపు వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న మొరం టిప్పర్.. బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో మహేశ్, పవన్ కల్యాణ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు, ఎస్సై రవి ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు. కాగా, జాతీయ రహదారి నిర్మాణం సందర్భంగా మొరం తీసుకొచ్చే టిప్పర్ ఢీకొని రెండు రోజుల క్రితం ఇద్దరు గాయపడినట్లు స్థానికులు చెబుతున్నారు.


చెల్లాచెదురుగా మృతదేహాలు

మిన్నంటిన రోదనలు..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారనే సమాచారం అందుకున్న కుటుంబీకులు, బంధువులు ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాల మీద పడి గుండెలవిసేలా రోదించారు.

కుందారం వద్ద బైక్‌ను ఢీకొన్న డీసీఎం..

- యువకుడి దుర్మరణం


మధు (ఫైల్)

లింగాలఘణపురం: డీసీఎం.. బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని జనగామ– సూర్యాపేట రోడ్డుపై కుందారం క్రాస్ వద్ద జరిగింది. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. కుందారం గ్రామానికి చెందిన దీగోజు మధు(26) రోజు వారీగా పనికోసం ద్విచక్రవాహనంపై జనగామకు వెళ్తుంటాడు. ఆదివారం కూడా వెళ్తుండగా కుందారం క్రాస్ వద్ద సూర్యాపేట నుంచి జనగామ వైపు వెళ్తున్న డీసీఎం.. కారును తప్పించబోయి ద్విచక్రవాహనంపై వెళ్తున్న మధును ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య, తల్లి, సోదరుడు ఉన్నారు. రోజు పని చేసి కుటుంబాన్ని పోషించుకొనే మధు మృతి చెందడంతో కుటుంబం దిక్కులేనిదయ్యింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.